కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ఉంగుటూరు: మండలంలోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉంగుటూరులో గ్రంథాలయ అధికారి యు.చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణలో డిబేట్, ఆటల పోటలు శనివారం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ పీటీ ఎం.క్రాంతి విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ రన్నింగ్ పోటి నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాల ఉపయోగాలను వివరిస్తూ గ్రామ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా తేలప్రోలు, ఆత్కూరు, మానికొండ గ్రంథాలయాల్లో వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం చేపట్టనున్నామని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి కోరారు.

ముగ్గుల పోటీలు...

పెనమలూరు: పెనమలూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి పి.హరీషా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, వలంటీర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు ఏ.సుస్మిత, ఎస్.మంజుల, ఎం.అనూష పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. వణుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.భారతి, హైస్కూల్ హెచ్‌ఎం రఘురామ్, ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం కె.ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు కె.విజయలక్ష్మి, సతీష్, మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలో...

గన్నవరం రూరల్: విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఆటలు ఉపయోగపడతాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం శనివారం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. హెచ్‌ఎంలు సుమిత్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు క్విజ్ పోటీలు నిర్వహించారు. రికార్డు అసిస్టెంట్ కె.జ్యోతికుమారి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుడు బి.గణపతి తదితరులు పాల్గొన్నారు.



పెనమలూరులో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



గన్నవరంలో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా ఆటల పోటీలు...

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యుడు చిమట రామారావు నేతృత్వంలో పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 20న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు రామారావు తెలిపారు. ఇన్‌ఛార్జ్ గ్రంథాలయాధికారి డి.బాబురావు, బీడీసీ పి.కోటేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, ఎం.ప్రభాకరచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో...

ఉయ్యూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షణలో విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు.

కంకిపాడులో....

కంకిపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. పోటీలను మహిళా సంరక్షణ కార్యదర్శి జ్యోతి, గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

క్లెయిమ్స్ పెండింగ్ లేకుండా చూడాలి

విజయవాడరూరల్: ఓటర్ల జాబితాలను సిద్ధం చేసే విషయంలో క్లెయిమ్స్‌ను పెండింగ్ లేకుండా ఆదివారంలోగా పూర్తి చేయాలని స్పెషల్ అధికారిణి సరళాదేవి బూత్‌స్థాయి అధికారులను ఆదేశించారు. విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారుల సమావేశం శనివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం విధులను నిర్వర్తించాలన్నారు. గన్నవరం నియోజకగవర్గానికి సంబంధించి విజయవాడ రూరల్ మండలంలో 2795 క్లెమ్స్ పెండింగ్‌లో వున్నాయని వాటిని గడువులోగా పూర్తి చేయని బిఎల్‌ఓలపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఫామ్-6కి సంబంధించి 1949, ఫామ్-7కి సంబంధించి 356, ఫామ్-8కి సంబంధించి 490 ఉన్నాయని తెలిపారు. ఈఆర్‌ఓ చంద్రలీల మాట్లాడుతూ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన 10మంది బూత్‌స్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో బూత్‌స్థాయి అధికారులదే పూర్తి బాధ్యత వుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.లక్ష్మీ, ఎంపీడీఓ బి.భార్గవి, డెప్యూటీ తహసీల్దారు ఎండి.సలీమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ అధికారి సరళాదేవి

అందరికీ ప్రభుత్వ పథకాలు

కంకిపాడు: అందరికీ ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందించి, వారి ఉన్నతికి కృషి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. బాబు మాట్లాడుతూ త్వరలో గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, ఎంపీటీసీ సభ్యులు షేక్ అమీనాబి, బూరగ బాలాజీ, అగ్రిబోర్డు డైరెక్టర్ నకరికంటి శేఖర్, నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, బిళ్లా వెంకటేశ్వరరావు, కొటేలు వెంకటేశ్వరరావు, ఈఓ వెంకటేశ్వరరావు, నాగదేశి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక సర్వీసులు

ఉయ్యూరు: కార్తిక మాసం సందర్భంగా త్రిలింగ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక సర్వీస్‌లు నడుపుతున్నామని ఉయ్యూరు డిపో మేనేజర్ కెఎస్‌ఆర్‌కె ప్రసాద్ శనివారం తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్తిక మాసం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీస్‌లు నడుపుతున్నామన్నారు. యాగంటి, శ్రీశైలం క్షేత్రాలకు కొత్తగా ఆదివారం నుంచి సూపర్ లగ్జరీ సర్వీస్ ఉయ్యూరు బస్టాండులో రాత్రి ఏడు గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. ఒక్కొక్కరికి టిక్కెట్ ధర రూ. 1900లు ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో 95624 సర్వీస్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చిత్రలేఖన పోటీలు

పెనమలూరు: 'సే నో టు డ్రగ్స్'పై పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు శనివారం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలు జరిపారు. ఈ సందర్భంగా సంస్థ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు బాలల హక్కులపై చాలా ప్రభావం చూపుతాయని చెప్పారు. మాదక ద్రవ్యాలపై ముందుగానే బాలలకు, తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తే వారిలో చైతన్యం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సుమలత, సంస్థ కో-ఆర్డినేటర్ వసంతకుమారి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని

నూర్‌బాషాలకు వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి ఇవ్వాలి

కంకిపాడు: నూర్‌బాషాలకు వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి ఇవ్వాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా కోరారు. కంకిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవికి అర్హత ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వక్ఫ్‌బోర్డు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకూ నూర్‌బాషాలకు అవకాశం రాలేదని పేర్కొన్నారు. ఈ దఫా ప్రభుత్వం నూర్‌బాషాలకు చైర్మన్ పదవి ఇచ్చి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

సామాజిక న్యాయం సాధించేందుకు సీఎం జగన్ కృషి

కంకిపాడు: సామాజిక న్యాయం సాధించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో కుంతీదేవి ఉత్సవాలు శనివారం రాత్రి నిర్వహించారు. ఉత్సవాలకు జూపూడి ప్రభాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ అన్ని వర్గాలకూ సమన్యాయం, అభివృద్ధి జరిగేలా సీఎం వైఎస్ జగన్ పాటు పడుతున్నారని చెప్పారు. రూ 2.37 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ చేసి వారి ఉన్నతికి తోడ్పాటునందించి, ఆదర్శ నేతగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత కోడె పండు, రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శి దాసి కెనడీ, ఎలికె స్టాలిన్, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, బత్తుల అనిల్, ఎన్.అఖిల్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు తగ్గాయి

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

కంకిపాడు: గతంతో పోలిస్తే ఈ ఏడాది కంకిపాడు సర్కిల్ పరిధిలో మహిళలపై అఘాయిత్యాలు తగ్గాయని ఏలూరు రేంజ్ డీఐజీ జి.అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కంకిపాడు సర్కిల్ కార్యాలయాన్ని డిఐజి అశోక్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహనా కార్యక్రమాలను పోలీసు శాఖ చేపట్టిందనిన్నారు. దిశ యాప్ ప్రజల్లో చైతన్యం నింపిందని తద్వారా మహిళలపై అఘాయిత్యాలు, దాడులు తగ్గుముఖం పట్టాయని వివరించారు. భూ తగాదాల నేపథ్యంలో హత్య జరిగిన ఘటన నమోదైందని భూ సమస్యలపై కక్షలు పెంచుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. కేసుల నమోదు విషయంలో సమన్వయం పాటించాలని, కౌన్సిలింగ్‌లను నిర్వహిస్తున్నామని చెప్పారు. పేకాట, గంజాయి, కోడిపందేల నిర్వహణను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి జూదాలు, గంజాయి అమ్మకాలు జరగకుండా సమర్థంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పి.జాషువా, డీఎస్పీ జయసూర్య, సిఐ శ్రీనివాసరావు, సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌కుమార్

మహిళను వేధిస్తున్న మాజీ భర్తపై కేసు

పెనమలూరు: మహిళ నుంచి విడాకులు తీసుకున్న మాజీ భర్త అసభ్య పోస్టులు పెడుతూ వేధిస్తుండటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌కు చెందిన మహిళ గతకొద్ది సంవత్సరాల క్రితం షేక్ బర్కత్‌అలీని వివాహం చేసుకుంది. అతని ప్రవర్తన సరిగాలేకపోవడంతో గత ఏప్రిల్‌లో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి అతను ఫోన్ చేసి నజీమున్నీసాను బెదిరించసాగాడు. అంతటితో ఆగకుండా ఫేస్‌బుక్, వాట్సాప్, స్నాప్‌చాట్, ఇన్‌స్ట్రాగామ్‌ల్లో ఆమె ఫోటోలు పెట్టి కాల్ గర్ల్‌గా చిత్రీకరించి ఫోన్ నంబర్లు పెట్టాడు. రాత్రి సమయల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పి.వి.రమేష్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

రామవరప్పాడు: విద్యారంగాభివృద్ధికి విశేష కృషి చేసిన, ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ ఎడ్వైజర్ పి.వి.రమేష్‌కు అరుదైన గౌరవం లభించింది. పలు రాష్ట్రాల్లో ఫార్మసీ, మెడికల్, డెంటల్, నర్సింగ్, డిగ్రీ కళాశాలలను ఈ పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా విద్యా, వసతులపై వ్యక్తిగత శిక్షణ ఇచ్చినందుకుగానూ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో టైమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో విద్యారంగంలో రమేష్‌కు ఈ ఎక్సలెన్స్ అవార్డును బీజేపీ నేషనల్ సెక్రటరీ మంజిర్ సింగ్ షిరస చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సార్కే ఫౌండేషన్ సెక్రటరీ బోయపాటి శ్రీ కృష్ణ మాట్లాడుతూ మారుతున్న విద్యా ప్రపంచానికి అనుగుణంగా భవిష్యత్‌లో నూతన సాంకేతిక విద్యను విద్యార్థులకు చేరవేసే విధంగా ఎప్పటికప్పుడు పరిశోధించి పలు కళాశాలల్లో అధ్యాపకులకు, విద్యార్థులకు పి.వి.రమేష్ శిక్షణ అందించారన్నారు.



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న విద్యావేత్త పి.వి.రమేష్

ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్ ప్రారంభించారు. అనంతరం డీప్ ట్రస్ట్ సౌజన్యంతో విజయవాడకు చెందిన మాక్సివిజన్ కంటి ఆస్పత్రి, దుహత దంత వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు, సిబ్బందికి నేత్ర, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ విద్యార్థులు కంటి, దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కె.రాజకిషోర్, పలువులు విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైఎస్సార్ సీపీ పాలనతోనే సంక్షేమం



గొడవర్రులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

కంకిపాడు: వైఎస్సార్ సీపీ పాలనతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి, సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు విజయచంద్రశేఖర్, ఉపసర్పంచ్ చెన్ను బాబూజీ, ఏఎంసీ డైరెక్టర్ చోరగుడి అనిత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కంకిపాడు: దళారులను నమ్మి మోసపోవద్దని ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు సూచించారు. మండలంలోని పునాదిపాడు, కోలవెన్ను రైతు భరోసా కేంద్రాల నుంచి రెండు లారీల ధాన్యం సేకరించి మిల్లులకు శనివారం రాత్రి తరలించారు. 40 టన్నులతో వెళ్తున్న ధాన్యం లారీలకు ఆర్డీఓ రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం సేకరణ సమర్థంగా చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు డొక్కు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ వెంకటరమణ, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, సర్పంచ్ సురేష్, ఆర్‌ఐ రాఘవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుటు ధ్వంసం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ లేఅవుట్‌ను ఏపీ సీఆర్డీఏ అధికారులు శనివారం ధ్వంసం చేశారు. ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ వివరాలు తెలుపుతూ గ్రామంలో సర్వే నెంబర్ 192లోని వ్యవసాయ భూమిలో అక్రమంగా లేఅవుట్ వేశారన్నారు. దీని వలన ప్రజలను మోసం చేయడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలిపారు. అక్రమ లేఅవుట్‌లో వేసిన రోడ్లను జేసీబీతో ధ్వంసం చేసి అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు.

టీడీపీ నేత దందా..

కాగా పెదపులిపాక గ్రామంలో టీడీపీ నేత అక్రమ లేఅవుట్ వేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో పలువురు టీడీపీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు అక్రమ లేఅవుట్లు, భవనల నిర్మాణం చేసి అమ్మకాలు సాగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని చెబుతున్నారు.

ఆర్థిక విశ్లేషణపై పీహెచ్‌డీ డాక్టరేట్

గన్నవరం: ఆంధ్రప్రదేశ్‌లోని మహిళా పెట్టుబడిదారుల ఆర్థిక విశ్లేషణపై పరిశోధనలు చేసినందుకుగానూ గన్నవరానికి చెందిన మున్నంగి సునీతకు ఆచార్య నాగర్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ గౌరవ డాక్టరేట్ లభించింది. ఏఎన్‌యూకు చెందిన ఎకనామిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.మధుబాబు పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు చేశారు. ముఖ్యంగా కోస్టల్ ప్రాంతంలో మహిళా పెట్టుబడిదారులు, వారు సాధించిన ప్రగతి, ఆయా రంగాల్లో పురోగతిపై ఆమె ఐదేళ్ల పాటు పరిశోధనలు సాగించారు. ప్రొఫెసర్ మధుబాబు నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ సర్టిఫికెట్లను సునీత అందుకున్నారు.



పీహెచ్‌డీ అందుకుంటున్న సునీత

పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ



వంట పాత్రలను అందజేస్తున్న ఎంపీపీ రవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి

గన్నవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం నిర్వాహకులకు వంట పాత్రలను శనివారం పంపిణీ చేశారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు ఎండి.గౌసాని చేతుల మీదుగా వంట ఏజెన్సీలకు సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండలంలోని 54 పాఠశాలలకు రూ. 5.58 లక్షల విలువైన వంట పాత్రలను ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కొక్క పాఠశాలకు ఏడు వేలు నుంచి రూ. 16 వేలు వరకు వెచ్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యను, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ కరిముల్లా, ఎంపీడీఓ ఇ.సత్యకుమార్, ఎంఈఓ-1 కె.రవికుమార్, ఎంఈఓ-2 ఆర్.కమల, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైఎస్సార్ సీపీ నేతలు శనివారం స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తనయుడు నితిన్‌కృష్ణ జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు చిన్నారులకు స్వీట్లు, బిస్కెట్లు, చాక్‌లెట్లు, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా సభ్యుడు చాన్‌బాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ బాటలో పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు ఖాదర్, సైకం చినబాబు, అజీజుల్లా, రెహమాన్, లతీఫ్, సిద్దిఖ్, ఆకునూరు సుబ్బారావు, తెన్నేటి ప్రకాష్, జీవన్ పలువురు పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కంకిపాడు: షెడ్యూల్ కులాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా కోరారు. సమితి ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్ర కాసరనేనివారిపాలెం, మద్దూరు, ప్రొద్దుటూరు, దావులూరు గ్రామాల్లో శనివారం సాగింది. ఈ సందర్భంగా ఏలియా మాట్లాడుతూ స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్స్ నిధులను షెడ్యూల్ కులాల ప్రగతికి వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంబా ప్రభుదాసు, కోశాధికారి ఉయ్యాల ఏడుకొండలు, నాయకులు కూచిపూడి ప్రకాశరావు, మద్దెల సాంబయ్య, కుంబా వెంకటేశ్వరరావు, గరికె దుర్గాప్రసాద్, బి.వెంకటేశ్వరరావు, గరికె వెంకటశివయ్య పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి శాంతి కల్యాణం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండపై ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్థానిక విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి 39వ వార్షిక శాంతి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ముఖ్య అతిథిగా ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనను సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

క్రీడల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఉయ్యూరు జెడ్పీ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల విజయవాడ, గుడివాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. అండర్-14 బాలుర విభాగంలో బాక్సింగ్‌లో నందకిషోర్, నాగచైతన్య, సాఫ్ట్‌బాల్‌లో రాహుల్, శ్రీకర్, బాలికల విభాగం త్రోబాల్‌లో శ్రీప్రియధరణి, జ్యోతి, అండర్-17 విభాగం బాలుర విభాగం టార్గెట్ బాల్‌లో కిరణ్ సత్తా చాటారు.

అవగాహన కార్యక్రమం

పెనమలూరు: యువత వ్యవసాలకు బానిసలు కాకుండా కాపాడటమే పోలీసుల లక్ష్యమని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. తాడిగడప పరిధిలో కాలువ కట్టలపై విజువల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా స్థానికులకు అవగాహనను శనివారం ఆయన కల్పించారు. సీఐ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వలన జీవితం అంధకారంగా మారుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ ఉషారాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.